అంగన్‌వాడీల్లో అవస్థలు..

కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కరువు

- గదుల్లో లేని ఫ్యాన్లు.. ఉక్కపోతకు అల్లాడుతున్న చిన్నారులు
- పట్టించుకోని వైనం


వసతులు లేని అద్దెగదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

ఎర్రుపాలెం: చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమగ్ర శిశు సంక్షేమ (ఐసీడీఎస్) శాఖ పనితీరు విమర్శలకు లోనవుతుంది. అద్దె గదుల్లో, కమ్యూనిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏమాత్రం సదుపాయాలు లేక చిన్నారులు, గర్భిణులు, తల్లులు అవస్థలకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేక వారి సంక్షేమం బుగ్గవుతుంది. మండలంలో మొత్తం 75 అంగన్‌వాడీ సెంటర్‌లున్నాయి. వీటిలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సున్న ప్రీస్కూల్ విద్యార్థులు మొత్తం 1,100 మంది ఉన్నారు. గర్భిణులు 450 మంది, 470 మంది తల్లులున్నారు.

అసంపూర్తిగా భవనాలు.. అద్దె గదుల్లో నిర్వహణ

మండలంలో మొత్తం 43 కేంద్రాలకు సొంత భవనాలుండగా, ఎర్రుపాలెం, సఖినవీడు, బుచ్చిరెడ్డిపాలెం, కొత్తపాలెం, ఇనగాలి, పెద్దగోపవరం తదితర గ్రామాల్లో అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. మిగతా 23 అంగన్‌వాడీ కేంద్రాలను కమ్యూనిటీ భవనాల్లో, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలల్లో, అద్దె ఫ్రీ గదుల్లో నిర్వహిస్తున్నారు. బంజర, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏళ్ల తరబడిగా అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి. అద్దె గదుల్లో, అద్దె ఫ్రీ గదుల్లో , కమ్యూనిటీ హాల్స్‌లో కూడా వసతులు లేవు. సొంత భవనాలు కూడా అరకొరగానే ఉన్నాయి.

వసతులు కరువు..


ఉక్కపోతలో చిన్నారులు..


బంజరలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

పలు కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదు. కనీసం ఫ్యాన్లు లేకపోవడంతో వేసవి అగ్గికి పిల్లలు మగ్గిపోతున్నారు. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, తల్లులు కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేవు. కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. కేంద్రాలు వేసవిలో ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు వేసవి కాలంలో ఎండవేడిమికి చిన్నారులు అల్లాడిపోతున్నారు. గృహాల్లో, ప్రభుత్వాఫీసుల్లో అధికారులు, పాలకులు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితుల్లో 3-6 ఏళ్లకు కనీసం ఫ్యాన్లు లేకుండా చిన్నారులు ఎలాగ ఉంటారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించాలని అధికారులను వేడుకుంటున్నారు.

వంట గది లేక ఇబ్బంది



మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె గదిలోనే నిర్వహిస్తున్నాం. ఇందులో వంటగది లేదు. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ కూడా సరిగ్గా లేదు. ప్రస్తుతం అద్దె నిమిత్తం రూ.వెయ్యి ఇస్తుండగా, మరో రూ.1,000 ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అంగన్‌వాడీ కేంద్రానికి సదుపాయాలు వసతుల కావాలి. వంటగది నిర్మించాలని ఇంటి యజమానిని కోరాం. వసతులు కాస్త తగ్గినప్పటికీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం.

– ఆశమ్మ, అంగన్‌వాడీ టీచర్, ఎర్రుపాలెం

కనీస వసతులు కల్పించకపోతే ఎలా



అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఇలా ఐతే కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులకు ఎలా సంక్షేమం అందుతుంది. గదుల్లో విద్యుత్ సౌకర్యం లేదు. ఫ్యాన్లు, వంటగదులు, టాయ్‌లెట్స్ లేవు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలి.

– వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్, రాజులదేవరపాడు

సమస్యలు నివేదించాం



అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేని విషయం వాస్తవమే. ఈ విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి వుంది. అద్దె గదుల్లో వసతుల కల్పనకు అద్దె నిమిత్తం గతంలో ఉన్న రూ.1,000కు తోడుగా మరో వెయ్యి రూపాయలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు వసతులు కల్పించాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మేరకు పోషకాహారం సరఫరా చేస్తున్నాం.

– కృష్ణశ్రీ, ఏసీడీపీఓ, ఎర్రుపాలెం

జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పర్యటన


వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం/బోనకల్: ఎర్రుపాలెం మండలంలోని పెగళ్లపాడు గ్రామాలు బోనకల్ మండలంలోని ఆదివారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. గ్రామాల్లో జరిగిన పలువురి వివాహాలకు, శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష,ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు,యన్నం శ్రీనివాసరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు చేబ్రోలు మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, బాణోతు కొండ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు కూల్చి వేశారంటూ ఫిర్యాదు

కొణిజర్ల: తమ కుటుంబ ఉమ్మడి ఆస్తి అయిన భూమిని ఆక్రమించుకుని, ఆ భూమిలో ఉన్న షెడ్డు కూల్చి వేసి తమను చంపుతామని బెదిరిస్తున్నారని మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన నెల్లూరి బాబూరావు, ఎస్ఎల్‌వీ ప్రభాదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 595, 596లో తమ వ్యవసాయ భూమిలో తమ తల్లిదండ్రులకు నిర్మించిన షెడ్డును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న స్విమ్మర్లు

వైరా: వైరా రిజర్వాయర్‌లో స్విమ్మర్స్ తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం ఎమ్మెల్యే రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వాయర్‌ను మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని, ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి మీర్ బహదూర్ జంగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని , వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంకణాల అర్జున్, మోహన్, రవికిరణ్, విగ్నేష్, దేవి, భూమి, వేద, గాయత్రి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గం ఎన్నిక


ఆలయ నూతన కమిటీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలినేని కాంతారావు, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, కార్యదర్శిగా మందపాటి రవీందర్ రెడ్డి, కోశాధికారిగా మల్లూరు అంకమరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కేశవ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి సీతారాములు తన భార్య ఉదయకుమారి జ్ఞాపకార్థం ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ మటీమ్, ప్రయాణికులు సీతారాములను అభినందించారు.

కన్నీళ్లు తుడిచేందుకే 'జోడోయాత్ర'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మధిర: దేశ వ్యాప్తంగా పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర చేపట్టారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. ఆదివారం ఖమ్మంపాడు గ్రామంలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర ముఖ్యాంశాలను ప్రజలకు కరపత్రాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దారా బాలరాజు, అద్దంకి రవి, దుంపా వెంకటేశ్వరరెడ్డి, బిట్ర ఉద్దండయ్య, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన బేతుపల్లి మత్స్య సహకార సంఘం సెక్రటరీ పాదిలి మారేశ్వరరావు తండ్రి పాదిలి మైసయ్య ఆదివారం మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మైసయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, ఫయాజ్ అలీ, మత్స్య సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ కొండా జయరాజు, యలమర్తి సత్యనారాయణ, జూపూడి ఏసురత్నం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

పెనుబల్లి: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కూతురే తలకొరువు పెట్టిన ఘటన పెనుబల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వేంసూరు గ్రామానికి చెందిన బింగి నారాయణ(95) ఆదివారం మృతిచెందగా అతనికి ఇద్దరూ కుమార్తెలే ఉన్నారు. పెద్ద కుమార్తె వెంకటనర్సమ్మ తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

కళలను బతికించేందుకే నృత్యశిక్షణలు


శిక్షణ పొందిన చిన్నారులతో ఎమ్మెల్యే, తదితరులు

సత్తుపల్లి: అంతరించిన పోతున్న కళలను బతికించేందుకు నృత్య శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని పీవీ నర్సింహారావు సెంటినరీ క్వార్టర్స్‌లో ఆదివారం తెలంగాణ జాగృతి సాగర్ ఆధ్వర్యాన నిర్వహించిన వేసవి నృత్య శిక్షణా తరగతులు ముగింపు వేడుకలు నిర్వహించారు. కళలకు ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం నృత్య శిక్షణలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, మేనేజర్ వీరయ్య, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ బొంతు రమేష్‌బాబు, డాన్స్ మాస్టర్లు గణేష్, మంజు, ఫిట్ సెక్రటరీలు ఉపేంద్రాచారి, క్రాంతి, మురళీకృష్ణ, రమేష్‌నాయక్, యూసూఫ్, చెన్నకేశవులు, మూర్తి, చిత్తూరి ప్రసాద్, అనిల్, వనమా వాసు, రఫీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కల్లూరు: సీఎం కప్‌కు సంబంధించి మండలం నుంచి 11 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియం జింఖానా మైదానం గచ్చిబౌలీ స్టేడియంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నారు. మండలం నుంచి వాలీబాల్‌కు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో బి.వంశీ, కె.లక్ష్మణ్, కె.విజేత, వి.లావణ్య, కబడ్డీలో శీలం వినోద్ కుమార్, బి.బాలాజీ, టి.కావేరి, ఖోఖోలో కావ్య, కె.మనస్విత, అథ్లెటిక్స్‌లో కె.రవితేజ, మహేష్‌లు ఎంపికయ్యారు. ఈ మేరకు క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధిశాఖ, ఎంపీడీఓ బి.రవికుమార్, తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎస్సై పి.రఘు, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ లక్కినేని నీరజ, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, వ్యాయామ ఉపాధ్యాయులు పీవీవీ సత్యనారాయణరెడ్డి, టి లక్ష్మీనరసయ్య, కె రాధాకృష్ణ, కె విజయకుమారి, టి త్రివేణి, ఇన్‌చార్జ్ పసుపులేటి వీరరాఘవయ్య, మండల గేమ్స్ సభ్యులు అభినందనలు తెలిపారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాధాకృష్ణ

మధిర: ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ అధికారులను కోరారు. మధిర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బోడేపూడి భవన్‌లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 333 జీవోను వెంటనే రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్స్ వెంటనే పునరుద్ధరించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్పొరేషన్, మున్సిపల్ పట్టణాల్లో విలీనమైన గ్రామాల్లో కూడా ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్


రామారావును సన్మానిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీ హెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపు ఆదివారం ముగిసింది. పాఠశాల 1961 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కొల్లిరామారావు పాఠశాల సౌకర్యార్థం రూ.3 లక్షలతో పది కంప్యూటర్‌లతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు కంప్యూటర్‌పై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి తరగతులు నిర్వహించారు. క్యాంపు ముగియటంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలను అందించారు. అనంతరం కొల్లి రామారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదం రామారావు, ఎస్ఎంసీ చైర్మన్ వేల్పుల పాపారావు, హెచ్ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయుడు అచ్చేందర్‌రెడ్డి, బండి శ్రీనివాసరావు, రామకృష్ణ, మోదేపల్లి అనంతరామయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు


గంగమ్మకు బోనాలు సమర్పించడానికి వెళ్తున్న కురమలు

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో కురమలు ఆదివారం గంగాదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం బీరమయ్య కొలువు నిర్వహించి బీరమయ్య, కామరాతి అమ్మవార్ల కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆదివారం 16 రోజుల పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురమ పెద్దలు బండారు మల్లయ్య, పగడాల బసవయ్యల నేతృత్వంలో శివసత్తుల పూనకాల మధ్య గంగమ్మకు పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

కారేపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అనంతరం కారేపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, అజ్మీర వీరన్న, అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ, తోటకూరి పిచ్చయ్య, తోటకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను విజయవంతం చేయాలి


చింతకాని: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


బోనకల్‌లో..

చింతకాని: జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో ఆదివారం ప్రజాగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ప్రజలను దగా చేస్తున్న అసమర్థత మోదీ ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దింపి, ప్రమాదంలో పడిపోతున్న దేశాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని చెప్పటానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యవర్గ సభ్యులు పదిమెల వెంకటనర్సయ్య, నాయకులు విజయ్, షేక్ చినజాన్, పంది శేఖర్, పుల్లయ్య, చాట్ల రమేష్, అరికొట్ల భాస్కర్, దమ్మాలపాటి శ్రీను, వజీర్, ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కోరారు. మండలంలోని రాపల్లి గ్రామంలో ఆదివారం ఆ పార్టీ సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆకెన పవన్, శైలేంద్రాచారి, అమర్‌నాథ్, వేమూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


హాజరైన పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1997 – 98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక నాలెడ్జి సెంటర్‌లో ఆత్మీయసమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని గత స్మృతులను జ్ఞాపికం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాజీ, గోపాలరావు, కర్నాటి పుల్లారెడ్డి, అద్దంకి రవికుమార్, వెంకటరామిరెడ్డి, కూరపాటి సరిత, తల్లపురెడ్డి కోటిరెడ్డి, గట్టి గుండె కమలాకర్, తాళ్లూరి సుబ్బారావు, బోడిపల్లి చిట్టిబాబు, సుఖ భోగి అశోక్, శీలం కనకారెడ్డి, కె.అనిల్, సత్తయ్య, చెన్నారావు, బర్రె సురేష్, మొండ్రు శేఖర్, కుదుముల లక్ష్మి, బొడ్డు విజయ, బొగ్గుల విజయలక్ష్మి, ఐలూరి సంగమేశ్వరీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, సినీ నటుడు దివంగత నందమూరి తారకరామారావు శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, మాజీ మంత్రి తుమ్మల


వైరా: నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి తదితరులు


ఎర్రుపాలెం: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'అల్లుకున్న' కరెంట్ కష్టాలు..

- ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, తీగలు
- లో వోల్టేజీతో ఇబ్బందులు

కొణిజర్ల: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొణిజర్లలో ఒక వీధిలో వారం రోజులుగా కరెంట్ కష్టాలు అలముకున్నాయి. కొణిజర్ల ఏపీజీవీబీ ఎదురు బజార్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చి చెట్లు, తీగలు అల్లుకుని తరుచూ ఫ్యూజులు పోతున్నాయి. వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఎడ్జ్ ఫ్యూజులు పోయి తరుచూ లో వోల్టేజీతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీనిపై ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేసినా కనీసం పోన్లు కూడా ఎత్తడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట ఫ్యూజ్ వేసేందుకు కూడా ఎవరూ ఉండటం లేదని, ప్రైవేట్ వ్యక్తులపై ఆధార పడాల్సి వస్తోందని వాపోతున్నారు. తరుచూ ట్రిప్ అయి కరెంట్ పోతుంటే రాత్రి పూట ఫోన్‌లు చేసి ఎందుకు విసిగిస్తున్నారంటూ తమపైనే మండి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంట్ సరఫరా సరిగ్గా జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు.


ఫ్యూజులు తెగిపోయిన వైర్లు


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు